
# గుణపాఠం

-ఉండవిల్లి. ఎమ్



కథ బాగుందంటూ ఉత్తరాలు వెల్లువలా ముంచెత్తాయి. అలా రోజూ వస్తూనే ఉన్నాయి. నా మనస్సంతా తృప్తిగా, ఆహ్లాదకరమైన భావంతో నిండిపోయింది.పత్రికలో కథతోపాటు, నా ఫోటో కూడా వేశారు. మీరు రాసిన 'ప్రేమలేఖ' కథ బాగుందంటూ ఒకబ్బాయి అదేపనిగా మెచ్చుకుంటూ, 'మిమ్మల్ని ప్రేమించాలని ఉంది. ప్రేమించి, పెళ్ళి చేసుకోవాలనుకుంటు న్నాను' అంటూ ఉత్తరాలు రాయడం మొదలె ట్టాడు. పత్రికలో ఫోటోవేసి, అడ్రస్‌వేస్తే, ఇలాంటి వ్యవహారాలు కూడా సాగుతాయని అప్పుడే తెల్సింది నాకు.

చాలాసార్లు "అలా ఉత్తరాలు రాయకూడదు. నువ్వెరివో తెలీదు. నేనెవరో తెలీదు. పత్రికలో చూసి పెళ్ళంటూ ఉత్తరం రాయడం సంస్కారం కాదంటూ" ఘాటుగా ఉత్తరాలు రాసినా, ఆ అబ్బాయి ప్రేమలేఖలు ఆపలేదు.

పైగా అతని ఫోటో కూడా పంపించి, నా ఫోటోలు పంపమని, చాలా రిక్వెస్టు చేస్తూ రాశాడు. చాలాసార్లు ఉత్తరాల్లో చెప్పిచూసి విసిగిపోయి, ఇతనికి తగిన శాస్తి చేయాలని పథకం వేసి "ఒకసారి నన్ను చూసి పోవడానికి ఆపై వచ్చే ఆదివారం రండి" అంటూ ఉత్తరం వేశాను.

* * *

అతనొచ్చే ఆదివారం నాడు మేమంతా ఒక గదిలో దాక్కుని, మా బామ్మని రంగంలోకి దింపాను. మా బామ్మకూడా "రానియ్యి! వాడి పని చెప్తాను. నన్ను చూసి జడవాల్సిందే ఆ బడుద్ధాయ్!" అంటూ అతని రాకకోసం లోపలికి బయటికి పచార్లు చేస్తోంది.

ఇంతలో కర్ర చంకలో పెట్టుకుని ఓ ముసలాయన "రచయిత్రి కావ్యమాల గారిల్లేనాండీ" అంటూ లోపలికి రాబోయాడు. మా బామ్మ "అవును! మీరెవరు?" అంటూ ఆయనవైపు చూసేంతలో ఆయన లోపలికి వచ్చేశాడు.

"మీరెవరూ చెప్పరేం?" అంటూ గద్దించింది మా బామ్మ.

"కావ్యమాలగారితో ఉత్తరాలతో పరిచయం ఉందిలెండి. ఈరోజు రమ్మంటే వచ్చా" అంటూ సోఫాలో చెప్పకుండానే చతికిలబడ్డాడు.

మా బామ్మకి మతిపోయింది. ఇంత వయసొచ్చిన మనిషి, నా మనవరాలికి ఉత్తరాలు ఎలా రాశాడా అని.

"కావ్యమాల గారు లేరాండీ?" అన్నాడు.

"నేనే ఆ కావ్యమాలను" అంటూ సర్దుకుని ఠీవిగా కూర్చుంది.

బామ్మ మనస్సులో లక్ష సందేహాలు, కొంపదీసి నన్ను పెళ్ళి చేసుకుంటానంటే, పరిస్థితి ఏమిటి? ఏం చెప్పాలి? రకరకాల ప్రశ్నలతో బామ్మ భయపడి అతనివంక చూస్తుంది.

అతను వెకిలిగా నవ్వి "మీరు అబద్ధమాడుతున్నారు. కావ్యమాలగారు మీరు కాదులెండి. ఆవిడ బామ్మగారు మీరు" అంటూ వంకర్లుపోయినట్టుగా ముఖం పెట్టాడు.

"నేనే ఆ కావ్యమాలను. ఆ ఫోటోలు నా చిన్నప్పటివి" మా బామ్మ భయంలేకుండా గట్టిగా అంది.

అతను గట్టిగా నవ్వి "నా మాటలకి జడుసుకోమాకండి. మీరు బొల్లిముంతల పాపాయమ్మ గారు, కావ్యమాల మీ మనవరాలు!" అన్నాడు.

మా బామ్మకి వణుకొచ్చింది. అప్పుడే ఎన్ని విషయాలు ఆరాతీసి వచ్చాడు. ఇతను ఎప్పుడో వచ్చి, ఊర్లో ఈ గుట్టు సేకరించి వచ్చాడన్న మాట. బామ్మ మనసులో అనుకుంది.

విషయం తెల్సిపోయిందని "అయితే ఏంటట?" అంది బామ్మ.

"కావ్యమాల పెళ్ళి గురించి మాట్లాడ్డానికి వచ్చా" అన్నాడు.

మాటలు రాక, బామ్మ అయోమయంలో పడిపోయింది. గదిలోంచి బయటికి రాక తప్ప లేదు నాకు.

బామ్మని సరిగా కూర్చోబెట్టి "మీరు ఉత్తరాలు రాసిన సుందర్రావా?" అన్నాను కోపంగా.

"కాదు!" అన్నాడు అతను.

ఆ మాటకి మా బామ్మ మామూలు మనిషై చూసింది. నేను ఆత్రుతగా "ఎవరు మీరు?" అన్నాను.

"సుందర్రావు తండ్రిని" అన్నాడు.

మాకు తర్వాత ఏం మాట్లాడాలో తెలీలేదు. అలా చూస్తుండిపోయాం.

ఇంతలో ఆయనే మాట్లాడాడు. "రాఘవయ్య పాపాయమ్మలగారి మనవరాలు కావ్యమాల కోసం, పత్రికలో చూసి రాలేదమ్మా! పూర్వం చుట్టరికం ఈ కుటుంబంతో ఉండేది. ఈ సంబంధం ఖాయం చేసుకోవాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాం. ఈలోగా పత్రికలో మీ మనువరాలు కథ, ఫోటో, అడ్రసు చూశాం. అమ్మాయి ఎలాంటిదో తెలుసుకోవాలని ఎన్నోసార్లు ఉత్తరాలు రాసినా, దానికి ప్రతిస్పందించకుండా భయంలేకుండా ఇంటికి రండి మాట్లాడుకుందాం అని ఉత్తరం రాసి, మిమ్మల్ని రంగంలో పెట్టిన అమ్మాయి గుణం, బుద్ధి నచ్చాయి. అందుకని పెళ్ళి విషయం మాట్లాడాలనుకుంటున్నాను" అని టూకీగా అన్నాడు.

అందరూ మౌనంగా ఉండిపోయారు.

"నాకిష్టంలేదు ఇలాంటి సంబంధం! ఉత్తరాలు రాసి పరీక్షలు పెట్టేవాళ్ళకి, రేపు ఏదోక అనుమానం రాదని గ్యారంటీ ఏమిటి? మరొకరెవరో అభిమాని ఉత్తరం రాయవచ్చు, దానికి అక్రమ సంబంధం అంటగట్టవచ్చు. నాలాంటి బుద్ధి, గుణం ఉన్నవారిని వెతకడం కాదు...మీలాంటి వాళ్ళు దురదృష్టంకొద్దీ ఎవరికీ తగలకూడదు. ఇక మీరెళ్ళొచ్చు" అనేసి గదిలోకి వెళ్ళిపోయాను.

ఆయన అవాక్కయి, బిక్కమొహం వేసుకుని బయటికి కదిలాడు. బామ్మ సినిమా చూసి హాల్లోంచి బయటకొచ్చిన దానిలా ముఖంపెట్టి ఆయన వెళ్ళినవైపే చూస్తుండిపోయింది.

★